
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.9 ꠰ కనిష్ఠం 19.4

నిర్మల్
జిల్లా వార్తలు
6
బుధవారం 14 ఫిబ్రవరి 2024


రంగు రంగు విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా వెలిగిపోతున్న అమ్మవారి క్షేత్రం

నేడే వసంతపంచమి

- బాసర సరస్వతీ అమ్మవారి సన్నిధిలో వేడుకలు
- అమ్మవారి పుట్టినరోజున అక్షరాభ్యాస పూజల కోసం తరలివచ్చిన భక్తులు
- వసతులు సరిపోక ఇబ్బందులు పడుతున్న భక్తులు
- సరస్వతీ అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించనున్న దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ


మంగళవారం రాత్రి
గదులు దొరకక ఆలయ పరిసరాల్లో బస చేస్తున్న భక్తులు

బాసర, ఫిబ్రవరి 13 : సరస్వతీ అమ్మవారు కొలువైన బాసర పుణ్యక్షేత్రం వసంతోత్సవం సందర్భంగా కళకళలాడుతుంది. అమ్మవారి జన్మదినమైన వసంత పంచమి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు ఉప ఆలయాలన్నింటినీ రంగురంగుల పువ్వులు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారి జన్మదినమైన వసంతపంచమి శుభదినాన అక్షరాభ్యాస పూజలు జరిపించేందుకు భక్తులు తరలి వచ్చారు. మంగళవారం సాయంత్రానికే పుణ్యక్షేత్రంలోని ప్రైవేటు దేవస్థాన సత్రాలన్నీ భక్తులతో నిండిపోయాయి. గదులు దొరకక చాలా మంది చంటి పిల్లలతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆలయ పరిసరాల్లో బస చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రద్దీని దృష్టిలో ఉంచుకొని అధికారులు ఉదయం 3 గంటల నుంచే అక్షర శ్రీకార పూజలు జరిపించేలా ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా మూడు చోట్ల అక్షర శ్రీకారపూజలు జరిపించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల రద్దీని దృష్టిలో ఉంచుకొని పోలీసులు అదనపు బలగాలతో భైంసా డివిజన్‌లోని పోలీస్‌స్టేషన్‌ల నుంచి వచ్చిన సీఐలు, ఎస్‌ఐలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయానికి కిలోమీటర్ దూరంలోనే పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించనున్న మంత్రి

ప్రతి సంవత్సరంలాగే ఈ ఏడాది కూడా అమ్మవారి జన్మదినమైన వసంత పంచమి ఆ చదువుల తల్లికి రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ మంత్రి కొండాసురేఖ పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. మంత్రితో పాటు ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పాల్గొననున్నారు. వసంత పంచమిని పురస్కరించుకొని ఇతర ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు అమ్మవారిని దర్శించుకోనున్నారు.

ఘనంగా 'మనసారా మనసారే మన అమ్మకు'


ఖానాపూర్‌లో 'మనసారా మనసారే మన అమ్మకు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న శైవక్షేత్ర వనితశక్తి ఖానాపూర్ శాఖ సభ్యులు

ఖానాపూర్, ఫిబ్రవరి 13 : శైవక్షేత్ర వనితశక్తి ఖానాపూర్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో 'మనసారా మనసారే మన అమ్మకు' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు మహాజన్ జితేందర్ సహకారంతో పట్టణంలోని మహాదేవ అన్నపూర్ణ దేవి ఆలయంలో అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. ఈ సందర్భంగా వనిత శక్తి నిర్మల్ జిల్లా మేనేజింగ్ డైరెక్టర్ గోలి మాధవి మాట్లాడుతూ... ప్రతి నెల అమ్మవారికి చీరే, సారే సమర్పించుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వనిత శక్తి డైరెక్టర్ చిన్నవార్ సరిత, అధ్యక్షురాలు కట్కం గీతారాణి, ప్రధాన కార్యదర్శి స్రవంతి, కోశాధికారి వరలక్ష్మితో పాటు ఆర్యవైశ్య సంఘం మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా మార్కండేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



దిలావర్‌పూర్, ఫిబ్రవరి 13 : మండలంలోని కాల్వలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మార్కండేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఆలయంలో యజ్ఞ క్రతువులు నిర్వహించారు. బుధవారం మార్కండేయ స్వామి వారి విగ్రహాన్ని వేద పండితులచే ఆలయంలో ప్రతిష్ఠించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం జరిగిన యజ్ఞంలో స్థానిక తాజా మాజీ సర్పంచ్ తిరుమల శ్రీనివాస్, గట్టు స్వామి, నర్సయ్య, లక్ష్మణ్, మనోహర్, పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు బోనాలు సమర్పణ

ముథోల్, ఫిబ్రవరి 13 : మండలంలోని తరోడా గ్రామంలో మంగళవారం గ్రామ దేవతలకు బోనాలను సమర్పించారు. గ్రామంలో బాజభజంత్రీలతో శోభాయాత్ర నిర్వహించి గ్రామ దేవతలకు బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలోని అందరూ ఆయురారోగ్యాలతో ఉండి పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని మొక్కుకున్నారు.


బాజభజంత్రీలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

గజిటెడ్ అధికారుల సంఘ సభ్యత్వ నమోదు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 13 : తెలంగాణ గజిటెడ్ అధికారుల సంఘ సభ్యత్వ నమోదు మంగళవారం ప్రారంభించారు. కేంద్ర కమిటీ సభ్యులు ఏ. శ్రీనివాస్‌రావు, ఏనుగు సత్యనారాయణ హాజరై సభ్యత్వ నమోదు ప్రారంభించారు. రాబోయే 15 రోజుల్లో కొత్త కమిటీ రాష్ట్రంలో ఏర్పాటు కానుందన్నారు. జిల్లా కార్యదర్శి పీజీ రెడ్డి, ప్రవీణ్, సత్యపాల్‌రెడ్డి, డాక్టర్ సురేష్, వసంత్ రావు, తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మేయిన్ ఫలితాల్లో భైంసా విద్యార్థికి 99.80 పర్సంటైల్



భైంసా, ఫిబ్రవరి 13 : పట్టణంలోని సాయినగర్‌కాలనీ చెందిన విద్యార్థి బి.శివసాయి మంగళవారం జేఈఈ మేయిన్ 2024 సెషన్-1 ఫలితాల్లో 99.80 పర్సంటైల్ స్కోర్ సాధించారు. 10వ తరగతి వరకు స్థానికంగా చదివిన సదరు విద్యార్థి ఇంటర్ హైదరాబాద్‌లోని ఒక కార్పోరేట్ కళాశాలలో చదువుతున్నాడు. శివసాయి తండ్రి బి. బాలాజీ ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా తల్లి మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు.

16న సమ్మె జయప్రదం చేయాలని ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాలు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 13 : కేంద్రం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న చేపట్టిన దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలంటూ నిర్మల్ జిల్లా కేంద్రంలో మంగళవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కే. రాజన్న మాట్లాడుతూ... 44 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చారని రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర చెల్లించడంలేదని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం 26 వేలు చెల్లించాలని, కార్పొరేషన్ సంస్థలకు ప్రభుత్వ రంగ సంస్థలకు అప్పజెప్పడం, తదితర వాటిని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త బంద్ చేపట్టామన్నారు. అసంఘటిత రంగ, సింగరేణి, కాంట్రాక్ట్ కార్మికులు ప్రజాస్వామ్యవాదులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎం. బక్కన్న, కే.లక్ష్మి, ఆర్.రామలక్ష్మణ్, కే.రాజు, చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్‌లో మున్సిపల్ చైర్మన్ పర్యటన

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 13 : నిర్మల్‌లోని రాంనగర్ శివాలయం ప్రాంతంలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పర్యటించారు. ఆ ప్రాంతంలో నెలకొన్న మురికి కాలువ సమస్య ప్రజలు చైర్మన్ దృష్టి తెచ్చారు. అస్తవ్యస్తంగా ఉన్న మురికి కాలువలను పరిశీలించారు. తక్షణ పరిష్కారం కోసం అధికారులను ఆదేశించారు. కమిషనర్ సీవీఎస్ రాజు, సానిటరీ అధికారి దేవిదాస్, తదితర అధికారులు కౌన్సిలర్ తారక వాణి రఘువీర్, అన్వర్ పాషా పాల్గొన్నారు.

నష్టపోయిన పంటను పరిశీలించిన ఎమ్మెల్యే


పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాంరావుపాటిల్

తానూర్, ఫిబ్రవరి 13 : ఆదివారం కురిసిన అకాల వర్షానికి నష్టపోయిన పంటను మంగళవారం ముథోల్ ఎమ్మెల్యే రాంరావుపాటిల్ పరిశీలించారు. మండలంలోని కోలూర్, మొగిలి, మసల్గా, ఏల్వీ గ్రామాల్లో నష్టపోయిన పంటలను పరిశీలించి రైతులకు భరోసా కల్పించారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట నేలపాలైందని రైతులు ఎమ్మెల్యేతో తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు నష్టపరిహారం అందించాలని అసెంబ్లీలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు కలవడం జరిగిందని, ఆందోళన చెందవద్దని ప్రభుత్వ తరుపున ఆదుకునేందకు పాటుపడతానన్నారు. ఎమ్మెల్యే వెంట వ్యవసాయశాఖ ఏడీ ఏ. వీణ, బీజేపీ నాయకులు శివాజీపటేల్, చక్రధర్ పటేల్, చిన్నారెడ్డి, లక్ష్మారెడ్డి, క్రిష్ణ, తదితరులున్నారు.

'పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి'

లోకేశ్వరం, ఫిబ్రవరి 13 : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు దాసరి శంకర్ అన్నారు. మంగళవారం టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలలను ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేజీబీవీ సీఆర్టీలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

ఈవీఎం మొదటి విడత తనిఖీ పూర్తి : కలెక్టర్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 13 : ఈవీఎం మొదటి విడత తనిఖీ ప్రక్రియ పూర్తయినట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. మంగళవారం ఈవీఎం గోదాం ఆవరణలో తనిఖీ చేశారు. రాజకీయ ప్రతినిధుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కలెక్టర్ రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంలు మొత్తం 4,134, బ్యాలెట్ యూనిట్లు 1,596, కంట్రోల్ యూనిట్లు 1,199, వీవీ ప్యాట్లు 1,339 మొదటి విడత తనిఖీ పూర్తి చేశామన్నారు. 181 రిజెక్ట్ జరిగాయన్నారు. మొదటి విడత తనిఖీ ఈసీఐఎల్ ఇంజనీర్ల బృందం పది మందితో కలిసి పూర్తయిందన్నారు. రాజకీయ ప్రతినిధుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించామని బుధవారం కూడా ఉంటుందన్నారు. నిబంధనలు పాటిస్తూ పారదర్శకంగా ఓటింగ్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


ఈవీఎంల తనిఖీ పరిశీలిస్తున్న కలెక్టర్

ఇంగ్లీష్ భాషా నైపుణ్యాల పెంపులో ఎల్టా కృషి ప్రశంసనీయం : ఆర్‌జేడీ



మాట్లాడుతున్న ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 13 : ఇంగ్లీష్ భాషా నైపుణ్యాల పెంపులో ఇంగ్లీష్ భాషా సంఘం (ఎల్టా) చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం సోఫీనగర్ బాలికల గురుకుల విద్యాలయంలో నిర్వహిం చిన విజార్డ్, డ్రామా జిల్లా స్థాయి పోటీలకు ఆయన హాజరయ్యారు. డీఈవో రవీందర్‌రెడ్డి ఆయన వెంట ఉన్నారు. ఈ పోటీలు ఆంగ్ల భాషా నైపుణ్యాలు పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థుల్లో నిగూఢమైన నైపుణ్యాలు వెలికి తీయడంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చి పోటీల్లో పాల్గొని విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ కార్యక్రమంలో న్యాయనిర్ణేతలుగా డాక్టర్ శంకర్, అఖిలేష్ కుమార్‌సింగ్ వ్యవహరించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎల్టా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కడార్ల రవీంద్ర, భూమన్న యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఆర్‌జేడీ

మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో మంగళవారం జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను ఆర్‌జేడీ సత్యనారాయణ సందర్శించిన ఈ సందర్భంగా మాట్లాడారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షల విషయంలో ఎటువంటి భయభ్రాంతులు కలుగకుండా నిర్భయంగా పరీక్షలు రాయాలని తెలిపారు. హాజరు పట్టికలను పరిశీలించి ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాధర్, సూపరిండెంట్ భోజన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కడెం ప్రాజెక్టుపై స్పందించిన అధికారులు



ఈ నెల 12వ తేదీన ఆంధ్రజ్యోతిలో 'వానాకాలం సీజన్ వరకైనా కడెం సిద్ధమయ్యేనా..?' అనే శీర్షికన ప్రచురితమైన కథనం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- వానాకాలం సీజన్ వరకైనా కడెం సిద్ధమయ్యేనా ? పై స్పందించిన అధికారులు
- టెండర్ ప్రక్రియ పూర్తవ్వగానే తాత్కాలిక మరమ్మతులు ప్రారంభిస్తామని వివరణ

ఖానాపూర్, ఫిబ్రవరి 13 : ఈ నెల 12వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'వానాకాలం సీజన్ వరకైనా కడెం సిద్ధమయ్యేనా..?' అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై జిల్లా అధికారులు స్పందించారు. ఈ మేరకు కడెం ప్రాజెక్టు కార్యనిర్వహణ అధికారి (ఈఈ) ఆర్. విఠల్ మంగళవారం వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా గత ఏడాది వానాకాలంలో వచ్చిన భారీ వరదలకు కడెం ప్రాజెక్టు 18 ఏళ్లలో దెబ్బతిన్న రోప్స్, రోలర్స్, గేర్ బాక్స్, బేరింగ్‌తో పాటు తదితర మెకానికల్ పనుల మరమ్మతుల కోసం గతంలో మంత్రి సీతక్క, స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు కడెం ప్రాజెక్టును సందర్శించిన సందర్భంగా వారికి నిధులను మంజూరు చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు. దీంతో ఇదివరకే రూ. 5.5 కోట్లకు ప్రతిపాదనలు పంపగా గత నెల 29వ తేదీన రూ. 5.46 కోట్లతో పనులు చేపట్టేందుకు పరిపాలన అనుమతులు వచ్చాయన్నారు. ఈ నిధులతో పనులు చేపట్టేందుకు టెండర్లను సైతం పిలవడం జరిగిందన్నారు. ఈ ప్రక్రియ ముగియగానే కడెం ప్రాజెక్టు తాత్కాలిక మరమ్మతు పనులను ప్రారంభిస్తామన్నారు. ప్రాజెక్టు వద్ద ఎలక్ట్రికల్ సిస్టం, కేబుల్ ప్యానల్ బోర్డు, ట్రాన్స్‌ఫార్మర్, డీపీ స్ట్రక్చర్, డీజీ సెట్, విద్యుత్ దీపాల ఏర్పాటు కోసం రూ. 375.50 లక్షల నిధులు మంజూరు చేయాలని గత ఏడాది అక్టోబరు మూడో తేదీన అప్పటి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం పరిపాలన అనుమతులు వచ్చిన నిధులతో తాత్కాలిక మరమ్మతు పనులను వేగవంతంగా పూర్తి చేసి వీలైనంత త్వరలో ప్రాజెక్టును సిద్ధం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

సంక్షిప్త సమాచారం

పల్సికర్ రంగారావు ప్రాజెక్టులో దూకి ఒకరి ఆత్మహత్య



భైంసా రూరల్, ఫిబ్రవరి 13 : కుబీర్ మండలం పార్డీ (బి) గ్రామానికి చెందిన కొంగుల రాజు(25) గుండెగాం గ్రామ సమీపంలో ఉన్న పల్సికర్ ప్రాజెక్టులో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన కథనం ప్రకారం... రాజుకు మూడు సంవత్సరాల క్రితం వివాహమై భార్యభర్తల మధ్య గొడవ జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుండి ఒంటరిగా తిరుగుతూ ప్రతి రోజు మద్యం సేవించి తిరిగేవాడు. జీవితంపై విరక్తి చెందిన తన అన్నకు ఫోన్ చేసి చనిపోతున్నానని చెప్పి ప్రాజెక్టులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అన్న అవినాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం, వాహనం

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 13 : నిర్మల్ పట్టణం సోఫీనగర్ ప్రాంతంలో అక్రమంగా తరలించేందుకు ఐచర్ వాహనంలో సిద్ధంగా ఉన్న పీడీఎస్ బియ్యం 20.50 క్వింటాళ్లు మంగళవారం విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. స్పెషల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రమణారెడ్డి ఆదేశాల మేరకు అధికారులు దాడి చేసి బియ్యాన్ని, వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఐవోపీ బి. ప్రశాంత్‌రావు తెలిపారు. తహసీల్దార్ దినేష్‌చంద్ర, డిప్యూటీ తహసీల్దార్ ఎల్. రవీందర్‌రెడ్డి బృందం ఈ దాడి చేసి బియ్యాన్ని స్వాధీనపర్చుకున్నారు.

కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రామ్‌లో భారీగా ద్విచక్ర వాహనాల సీజ్


పట్టుబడిన ద్విచక్ర వాహనాలు

భైంసా, ఫిబ్రవరి 13: పట్టణ పరిధిలోని సిద్ధార్థనగర్ కాలనీలో మంగళవారం పోలీసుశాఖ కమ్యూనిటి కాంటాక్టు ప్రోగ్రాం చేపట్టింది. ఇందులో టౌన్ సీఐ రాజారెడ్డి నేతృత్వంలో 60 మందికి పైగా పోలీసు అధికారులు సిబ్బంది కాలనీ పరిధిలో ఇంటింటా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సరియైన ధృవీకరణ పత్రాలు లేని 127 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు, ఒక కారును పోలీసులు స్వాధీనపరుచుకున్నారు. కమ్యూనిటి కాంటాక్టు ప్రోగ్రాం సందర్భంగా కాలనీవాసులతో టౌన్ సీఐ రాజారెడ్డి సమావేశం నిర్వహించి మాట్లాడారు. సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తతతో వ్యవహరించాలన్నారు. కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసు శాఖ సమాచారం అందివ్వాలన్నారు.

'మన బడి' పనులు ముందుకు సాగేనా!?




కుభీర్‌లో నత్తనడకన కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణం ఇలా..

కుభీర్, ఫిబ్రవరి 13 : ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం 'మనఊరు మనబడి' పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించింది. పథకం కింద చేపట్టిన పనులు వివిధ పాఠశాలల్లో కొనసాగి ఆగిపోయాయి. మరికొన్ని చోట్ల నత్తనడకన సాగుతున్నాయి. గత ఏడాది జూలై నుంచి పనులు చేపట్టిన ఇప్పటికీ పూర్తి కాలేదు. తొలివిడతలో ప్రారంభించిన అదనపు తరగతి గదులు, డైనింగ్ హాల్‌లు వంటశాలలు, మూత్రశాలల నిర్మాణాలకు మోక్షం కలిగేలా లేదు. మరమ్మతులు గత ప్రభుత్వం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 24 పాఠశాలలను సెలక్ట్ చేసి అదనపు గదులు నిర్మించేందుకు పనులను ప్రారంభించింది. కాగా ఇప్పటి వరకు కేవలం మూడు పాఠశాల పనులు మాత్రమే పూర్తయ్యాయి. మరికొన్ని పాఠశాలల్లో టెండర్లు వచ్చిన గుత్తేదారులు పనులు చేపట్టడం లేదు. దీంతో పనులు సాగేనా అని పలువురు పోషకులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకం కింద 12 రకాల అభివృద్ధి పనులను ఇంజనీరింగ్ విభాగం అధికారులు గుర్తించిన విషయం తెలిసిందే. తొలి నాళ్లలో చాలా మంది గుత్తేదారులు బిల్లుల మంజూరిపై సందేహంతో పనులు ఆలస్యంగా చేపట్టారు. ఇన్నాళ్లుగా కనీసం 30శాతం కూడా పనులు పూర్తి కాలేదు. వీటితో పాటు మిగత చిన్నపాటి మరమ్మతులు చేపడితే వచ్చే విద్యాసంవత్సరం నాటికి విద్యాలయాల పరిస్థితి కాస్త మెరుగుపడుతుంది. నిబంధనల ప్రకారం పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ) చైర్మన్‌ల ఆధ్వర్యంలో పనులు చేపట్టాల్సి ఉంది. కానీ చాలా చోట్లవీటిని నాయకులు ప్రారంభించారు. రూ.30లక్షలకు పైగా నిధులతో చేపట్టే పనులకు టెండర్లు నిర్వహించగా కొన్ని గ్రామాల్లో గుత్తేదారులు నేటికీ ముందుకు రాని పరిస్థితి నెలకొంది. ముందుకు వచ్చిన డైనింగ్‌హాల్, మూత్రశాలల వంటి అభివృద్ధి పనులు పూర్తి చేసిన వారికి సకాలంలో బిల్లులు రాకపోవడం, సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడం లేదు. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం పథకం కొనసాగింపుపై ఏ నిర్ణయం తీసుకుంటుందో అనేది చర్చనీయాంశంగా మారింది.

నూతన ఎంపీడీవోల నియామకం

భైంసా, ఫిబ్రవరి 13: జిల్లాలోని 18 మండలాలకు నూతన ఎంపీడీవోల నియామకం జరిగింది. పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా ఎంపీడీవోల బదిలీలు జరిగాయి. ఇందులో భాగంగానే ఇది వరకు జిల్లాలో పనిచేసిన ఎంపీడీవోలు బదిలీల్లో భాగంగా ఆదిలాబాద్,మంచిర్యాల్, నిజామాబాద్ జిల్లాలకు బదిలీ అవ్వగా అక్కడి మండలాల నుంచి ఎంపీడీవోలు ఇక్కడికి బదిలీపై వచ్చారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు బదిలీపై జిల్లాకు వచ్చిన ఎంపీడీవోలకు మండలాలను కేటాయించారు. అయితే తానూర్, లోకేశ్వరం, కుంటాల, భైంసా, బాసర మండలాలకు ఆయా ఎంపీపీ కార్యాలయాల్లో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులకు ఎఫ్ఏసీ ఎంపీడీవోలుగా బాధ్యతలను అప్పచెప్పారు. కొత్తగా ఆయా మండలాలకు నియమితులైన ఎంపీడీవోల వివరాలు.. కుభీర్ మండలానికి ఎం.శ్రీనివాస్, నిర్మల్ మండలానికి డబ్ల్యూ గజానన్‌రావ్, కడెం మండలానికి బి.అరుణ, నర్సాపూర్ (జి) మండలానికి టి.పుష్పలత, సోన్ మండలానికి ఎస్.సురేష్, పెంబి మండలానికి బి.రమాకాంత్, ఖానాపూర్ మండలానికి జె.సునీత, లక్ష్మణ్‌చాంద మండలానికి వి.రాం ప్రసాద్, సారంగపూర్ మండలానికి డి.లక్ష్మీకాంత్‌రావ్, దస్తూరాబాద్ మండలానికి కె.రమేష్, మామడ మండలానికి వి.సుశీల్‌రెడ్డి, దిలావర్‌పూర్ మండలానికి ఎస్.అరుణరాణి, ముథోల్ మండలానికి బి.రాములు, తానూర్ మండలానికి అక్కడి ఎంపీపీ కార్యాలయంలో ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న మోహన్‌సింగ్‌కు ఎఫ్ఏసీ ఎంపీడీవోగా, లోకేశ్వరం మండలానికి అక్కడి ఎంపీపీ కార్యాలయంలో ఎంపీవోగానున్న సోలోమన్‌రాజ్‌కు ఎఫ్ఏసీ ఎంపీడీవోగా, కుంటాల మండలానికి అక్కడి ఎంపీపీ కార్యాలయంలో ఎంపీవోగానున్న ఎం.ఎ.రహీమ్‌ను ఎఫ్ఏసీ ఎంపీడీవోగా, భైంసా మండలానికి లక్ష్మణ్‌చాంద ఎంపీపీ కార్యాలయంలో సూపరిండెంట్‌గానున్న పి.సుధాకర్ రెడ్డిను ఎఫ్ఏసీ ఎంపీడీవోగా, బాసర మండలానికి అక్కడి ఎంపీపీ కార్యాలయంలో సూపరిండెంట్‌గానున్న బి.అశోక్‌కుమార్‌కు ఎఫ్ఏసీ ఎండీవోగా నియమితులయ్యారు.

మున్నూరు కాపు యువజన పోస్టర్ ఆవిష్కరణ

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 13 : మున్నూరు కాపు యువజన పోస్టర్లను మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ మంగళవారం ఆవిష్కరించారు. నిజామాబాద్ జిల్లా సంఘ నేతలు చైర్మన్ ఈశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కౌన్సిలర్లు ఎస్పీ రాజు, తదితరులు పాల్గొన్నారు.

అలేఖ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

● సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్


బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న నూతన్ కుమార్

ఖానాపూర్, ఫిబ్రవరి 13 : ఇటీవల ఖానాపూర్ పట్టణంలో అలేఖ్య అనే యువతి దారుణమైన హత్యకు గురైనందున వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకొని వారికి అండగా నిలవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం అలేఖ్య కుటుంబాన్ని సీపీఎం తో పాటు ఆశావర్కర్స్ యూనియన్ సీఐటీయూ తదితర ప్రజాసంఘాల నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా అలేఖ్య కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిందితులకు తక్షణమే కఠిన శిక్ష పడాలంటే వెంటనే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలో హత్య జరగడం అంటే కచ్చితంగా ఇది పోలీసుల వైఫల్యమేనని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నిర్మల్ జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులు సురేష్, మినుగుల కమల, తదితరులున్నారు.

ఆరు గ్యారెంటీలకు కట్టుబడి ఉన్నాం

● దర్గా రోడ్డు పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే బొజ్జు ● ఇంద్రవెల్లిలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన పటేల్


పాత ఉట్నూర్‌లో, దర్గారోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే


భీంనగర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తూ..

ఉట్నూర్, ఫిబ్రవరి 13: తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలుకు కట్టుబడి ఉందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని పాత ఉట్నూర్, ఎత్మనూర్‌నగర్ కాలనీలో సీసీ రోడ్లు, మురికి కాలువల పనులకు భూమిపూజలు చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చెప్పిందే చేస్తుందని చేసేది చెప్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తుందని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజలకు న్యాయం చేస్తామన్నారు. త్వరలో ఆరు గ్యారంటీలను అమలుచేసి ప్రతి పేదవాడికి అందే విధంగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంద్రజైవంత్‌రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖయ్యూమ్, ఎక్బాల్, హార్షద్, అజిమొద్దిన్, లింగంపల్లి చంద్రయ్య, దూట రాజేశ్వర్, మారుతి, ఏఈ రాథోడ్‌ఇందల్, కాంట్రాక్టర్ ముంతాజ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

● గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

ఇంద్రవెల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని భీంనగర్, మిలింద్‌నగర్, ప్రబుద్దనగర్, గోండుగూడలతో పాటు మండలంలోని సట్వాజీగూడ, మర్కగూడ, బుర్సన్ పటార్, పిప్రి గ్రామాల్లో రూ.40 లక్షలతో నిర్మించనున్న రోడ్లు, డ్రైనేజీ పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యంగా గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అర్క పుష్పలత, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సోన్ కాంబ్లే జితేందర్, సోమోరే నాగోరావు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థికి ప్రశంస పత్రాన్ని అందజేస్తున్న డీడీ, డీఈవో


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక విద్యార్థులు

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి

● డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్ ● రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు మార్గనిర్దేశం ● హాజరైన డీఈవో

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 13: ఈనెల 28న జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని జిల్లా స్థాయిలో పెయింటింగ్, కవిత్వం, ఉపన్యాసం, పాటలు పోటీలను ఆశ్రమ ఉన్నత పాఠశాల కోలాం బాలురలో నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రతి విభాగం ఒంచి ముగ్గురు విద్యార్థులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించి వారిలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా ఈ పోటీలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. పాఠశాల స్థాయి నుంచి సైన్స్ పట్ల మక్కువను పెంచుకుని మన చుట్టు ఉన్న పరిసరాలలోని అనేక సమస్యలకు పరిష్కారాలు కనుక్కొని, కొత్త ఆవిష్కరణలు చేయాలన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు మెమోంటో సర్టిఫికేట్స్, చెక్‌ముకి సైన్స్ పత్రికలను అందజేశారు. అనంతరం జిల్లా విద్యాధికారి ప్రణీత మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించుకుని ప్రకృతిని పరిరక్షించే విధంగా ప్లాస్టిక్ నిషేధించేవిధంగా విద్యార్థుల ఉపన్యాసాలు, పాటలు, కవిత్వం ఎంతో బాగున్నాయని ప్రశంసించారు. ఆ తర్వాత రాష్ట్ర స్థాయిలో పాల్గొనే విద్యార్థులు ఈనెల 28న రవీంద్రభారతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని వారికి దిశానిర్దేశం చేయడం జరిగిందని తెలిపారు. ఇందులో జిల్లా సైన్స్ అధికారి రఘురమణ, ట్రైబల్ స్పోర్ట్స్ ఆఫీసర్ పార్థసారథి, ఏటీడీఓ నిహారిక, అకాడమిక్ కో ఆర్డినేటర్ ఆరే.భాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణ్‌రావు, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి నూతుల రవీందర్ జ్యూరీ మెంబర్‌గా తెలుగుచరందాస్, ఏలియా, ఆశన్న, గంగన్న, సంతోష్, వేణుగోపాల్, మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఖోడద్ పాఠశాలలో అలరించిన మేళా

తలమడుగు, ఫిబ్రవరి 13: మండలంలోని ఖోడద్ పాఠశాల నిర్వహించిన సముదాయ స్థాయి మేళా ఎంతగానో ఆకట్టుకుంది. విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి కోరారు. పరీక్షల సమయం సమీపిస్తున్నందున విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా ఉపాధ్యాయులు అందించే సలహాలు సూచనలు పాటించి మండలంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఇందులో ఇందులో ఎంపీపీ కళ్యాణలక్ష్మి రాజేశ్వర్, ఎస్‌వో సుజాత్ ఖాన్, ఎస్‌వో నారాయణ, నోడల్ ఆఫీసర్ వెంకట్‌రావు, ఎంఈవో నారాయణ, హెచ్‌ఎం ఖోడద్‌కృష్ణకుమారి, తదితరులున్నారు.


విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న ప్రజాప్రతినిధులు

'అభివృద్ధిని అడ్డుకుంటున్న బీఆర్‌ఎస్'

నేరడిగొండ, ఫిబ్రవరి 13: అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్‌ఎస్ నాయకులు అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆడే వసంతరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడె గజేందర్‌పై సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. బోథ్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడిపిస్తున్న వారిపై విమర్శలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షుడు అల్లూరి ప్రఫుల్‌చందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నాయుడు రవి, మైనార్టీ చైర్మన్ వకీల్, నాయకులు పాల శంకర్, ఆడే జానర్ధన్ రాములు, కృష్ణ, రవి, రాజుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పదవులు శాశ్వతం కాదు : ఎంపీపీ

బోథ్, ఫిబ్రవరి 13: రాజకీయాలలో ఉండే వారికి పదవులు ముఖ్యం అనుకోకుండా పని చేస్తూ పర్జల దీవెనలను పొందాలని ఎంపీపీ తుల శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం బోథ్ గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామ పంచాయతీ పాలకవర్గంతో పాటు సర్పంచ్ సురేందర్ యాదవ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అనుకుంటే ఎవరినైనా పదవులకు దూరంగా ఉంచడంతో పాటు అవసరమా? అనుకున్నప్పుడు అందలమెక్కిస్తారని పేర్కొన్నారు. ఎంపీపీగా కాకుండా సామాన్యుడిగా అందరికీ అందుబాటులో ఉండి ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ మల్లెపూల సుభాష్, ఎంపీఈవో అంజయ్య, వార్డు సభ్యులు గంగయ్య, వెంకటేష్, అపర్ణ, గంగామణి, షేక్ షాకీర్, తుకారం, గోపి, లక్ష్మీ, గిరీస్, తస్లీమా బేగం, గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

● ఆదిలాబాద్ ఎంపీ సోయం

తాంసి, ఫిబ్రవరి 13: దేశంలో బీజేపీ పాలనలోనే గ్రామాలు పూర్తి స్థాయి అభివృద్ధికి నోచుకుంటాయని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. మంగళవారం తాంసి మండల కేంద్రంలో పలు సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సోయం బాపూరావు మాట్లాడుతున్న రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికే ఓటు వేయాలన్నారు. దేశంలో నరేంద్రమోదీ పాలన ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ప్రతీ గ్రామంలోని వీధుల్లో సీసీ రోడ్లతో పాటు ప్రజల కనీస సౌకర్యాల కల్పన కోసం నిధులు కేటాయిస్తామన్నారు. గ్రామాల అభివృద్ధిలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని అప్పుడే సుస్థిర పాలన సాధ్యమవుతుందన్నారు. ముఖ్యంగా గ్రామాల్లోని విద్యావంతులైన యువత కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా 20 లక్షలతో నిర్మాణం చేపడుతున్న సీసీ రోడ్లకు ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్‌రెడ్డి, నాయకులు అరుగుల రాములు, నాగిడి నర్సారెడ్డి, ప్రకాష్, పెంటపర్తి స్వామి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్

● మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 13: అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో పదవికాలం పూర్తి చేసుకున్న పార్టీ సర్పంచ్‌లకు సన్మానకార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లకు జోగు రామన్న శాలువలు వేసి సత్కరించి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలన్న మహాత్మాగాంధీ అన్న మాటలను నిజాం చేసేలా మాజీ సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేశారన్నారు. ఇందులో నాయకులు మనోహర్, రోకండ్ల రమేష్, లింగారెడ్డి, సాజిదొద్దిన్, ప్రహ్లాద్, కుమ్రరాజు, గంబీర్‌టాక్రె, సతీష్‌పవార్, తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమా భరోసా : ఏఈవో

ఉట్నూర్, ఫిబ్రవరి 13: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రైతుబీమా పథకం మృతి చెందిన రైతుల కుటుంబాలకు భరోసాగా నిలుస్తుందని ఉట్నూర్ వ్యవసాయ విస్తరణ అధికారి కుడిమెత సుధాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని చిన్న గంగాపూ ర్‌లో మృతి చెందిన రైతు చిక్రం మాన్కు కుటుంబ సభ్యులను కలిసి వారి నుంచి రైతుబీమా పొందడానికి కావాల్సిన పత్రాలను డాక్యుమెంట్లుగా చేసిన ఆన్‌లైన్ నమోదు చేయడం ద్వారా వారికి త్వరలోనే రూ.5లక్షలు ప్రమాద బీమా నుంచి లభిస్తాయని తెలిపారు.

'అభివృద్ధి చూసి ఓర్వలేకే విమర్శలు'

తలమడుగు, ఫిబ్రవరి 13: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే రెండు నెలల్లోనే చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేకని విమర్శలు చేస్తున్నారని జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బరంపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాల పరిపాలించిన బీఆర్‌ఎస్ పార్టీని ఏనాడు గ్రామాలను పట్టించుకోలేదన్నారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించడం జరిగిందన్నారు. అనంతరం బరంపూర్ గ్రామంలో రూ.25 లక్షల ఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధుల నుంచి మంజూరైన సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు భూమిపూజ చేసిన తలమడుగు జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అదే గ్రామంలో జడ్పీహెచ్‌ఎస్ స్కూల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బొల్లారపు బాబన్న, ఎంపీటీసీ రంజిత్ రెడ్డి, ఎంఈవో నారాయణ, హెచ్‌ఎం ప్రత్యూష, సెక్రటరీ అనిల్‌రెడ్డి, మహేందర్, ఉపాధ్యాయులు, పీఏసీఎస్ డైరెక్టర్ ప్రతాప్, బాపురావు, నర్సయ్య నమ్ము, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెక్కుల పంపిణీ

గుడిహత్నూర్, ఫిబ్రవరి 13: ఇటీవల మండలంలో చిరుతపులి దాడిలో మృతి చెందిన పశువుల యజమానులకు మంగళవారం ఇచ్చోడ ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో ఎఫ్‌ఆర్‌వో పుండలిక్ నష్ట పరిహారం చెక్కులు అందజేశారు. దామన్‌గూడకు చెందిన ఎం.కృష్ణ అనే రైతుకు చెందిన ఎద్దును చిరుతపులి దాడిలో మృతి చెందినందుకు 23 వేల రూపాయల నష్ట పరిహారం మంజూరు కాగా అలాగే ముత్నూర్‌కు చెందిన నాగర్ గోజే కేశవ్‌కు చెందిన దూడ చిరుతపులి దాడిలో మరణించినందుకు 12 వేలు నష్ట పరిహారం చెక్కులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎఫ్‌ఆర్‌వో మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో ఉండే వన్య ప్రాణులన్నింటిని కాపాడాలని పశువులపై ఏదైనా వన్యమృగం దాడిలో మరణించి ఉంటే వెంటనే ఫారెస్ట్ అధికారులకు తెలపాలని వారికి ప్రభుత్వం తరపున నష్ట పరిహారం చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా వన్యమృగం వేట కోసం విద్యుత్ తీగలు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌వో భూమన్న, ఎఫ్‌బీవో కృష్ణనాయక్, తదితరులు ఉన్నారు.


చెక్కులు అందజేస్తున్న ఎఫ్‌ఆర్‌వో పుండలిక్

20న బాసర నుంచి కొమరం భీమ్ విజయ సంకల్పయాత్ర

విజయ సంకల్పయాత్ర ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి రావుల రాంనాథ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రావుల రాంనాథ్

ఖానాపూర్, ఫిబ్రవరి 13 : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపులక్ష్యంగా చేపట్టిన కొమరం భీమ్ విజయసంకల్ప యాత్ర ఈ నెల 20వ తేదీన బాసర నుంచి ప్రారంభమవుతుందని ఆ యాత్ర ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి రావుల రాంనాథ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని 17 పార్లమెంట్ స్థానాల్లో బీజేపీ కచ్చితంగా 12 సీట్లను గెలిచేలా పార్టీ అధిష్టానం వ్యూహరచన చేస్తుందన్నారు. అందులో భాగంగానే 17 పార్లమెంటు స్థానాలను ఐదు క్లస్టర్లుగా ఏర్పాటు చేసి ఐదు స్థలాల నుంచి విజయసంకల్ప యాత్ర పేరిట ఒకేరోజు బస్సుయాత్రను ప్రారంభిస్తామన్నారు. కొమరం భీమ్ క్లస్టర్‌లో ఆదిలాబాద్, నిజామాబాద్, పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గాలు ఉంటాయన్నారు. ఈ మూడు ఎంపీ స్థానాలను కలిపి కొమరం భీమ్‌క్లస్టర్‌గా ఏర్పాటు చేసినందున కొమరం భీమ్ విజయ సంకల్పయాత్ర పేరిట నిర్వహించనున్న బస్సుయాత్ర 21 అసెంబ్లీ స్థానాలలో పది రోజులపాటు కొనసాగుతుందన్నారు. ఈ బస్సుయాత్రలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నిజస్వరూపాలను బయటపెడతామన్నారు. రెండు పార్టీలు కలిసి కృష్ణా జలాల పేరిట కొత్త డ్రామాలకు తెరలేపాయని ఆరోపించారు. ఈ రెండు పార్టీలు ఒక్కటేనని ప్రజలకు ఇదివరకే అర్థమైందన్నారు. అధికారంలోకి రాకముందు కాళేశ్వరంపై సీబీఐ ఎంక్వయిరీ కోరిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే జ్యుడీషియల్ ఎంక్వయిరీ అంటూ పేర్కొనడంపై ప్రజల్లో పలు సందేహాలున్నాయన్నారు. 420 హామీలను ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ కేవలం ఆరు గ్యారంటీలే అంటూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. దేశాన్ని ఆర్థికంగా ప్రపంచంలో ప్రస్తుతం ఐదవస్థానంలో నిలిపిన ప్రధాన నరేంద్రమోదీకే ప్రజలు మరోసారి పట్టం కట్టాలని ఆలోచిస్తున్నారన్నారు. మోదీ తిరిగి మళ్లీ ప్రధానమంత్రి అయితే రాబోయే రోజుల్లో భారత్ ప్రపంచంలోనే బలమైన శక్తిగా ఎదుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు నాయిని సంతోష్, జిల్లా నాయకులు గోపాల్ రెడ్డి, దాదే మల్లయ్య, రవీందర్‌రెడ్డి, తదితరులున్నారు.

వరి పంట పరిశీలన

కుంటాల, ఫిబ్రవరి, 13: ప్రస్తుతం వరిపైరులో కాండం తొలుచు పురుగు సమస్య పట్టి పీడిస్తుంది. ఈ సందర్భంగా మంగళవారం మండలంలోని అంబకంటి, తదితర గ్రామాలల్లో వ్యవసాయ శాస్త్రవేత్త కార్తీక్ ఆధ్వర్యంలో వరి పంటలను పరిశీలించారు. వరి పైరులో కాండం తొలుచు పురుగు నివారణ కార్బస్ హైడ్రోక్లోరైడ్ 4 జీ గులికలు ఎకరానికి 8 కిలోల చొప్పున చల్లాలని లేదా లామ్డా సెలోత్రిన్ పిచికారి చేసినట్లయితే కొంత మేర ఈ చీడపీడల నుంచి నివారించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతుల వరి పైర్లను ఏవో సోమ లింగారెడ్డి, ఏఈవో మహేష్, శాస్త్రవేత్తలు కలిసి పరిశీలించారు.





పార్లమెంట్‌కు.. పోటాపోటీ!

- జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలే టార్గెట్‌గా నేతల ప్రయత్నాలు
- ప్రధాన పార్టీల చుట్టూ ఆశావహ నేతల చక్కర్లు
- రిజర్వుడ్ స్థానం కావడంతో టికెట్ కోసం పోటాపోటీ
- పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లో విస్తృత పర్యటనలు
- పార్టీ నేతల మద్దతు కోసం ముమ్మర ప్రయత్నాలు
- జిల్లావ్యాప్తంగా రోజురోజుకూ మారనున్న రాజకీయ సమీకరణలు



ఆదిలాబాద్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలే టార్గెట్‌గా కొంత మంది నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఆశావహ నేతల తాకిడి మొదలయ్యింది. పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది ఆశావహ నేతల జాబితా మరింత పెరుగుతూ వస్తోంది. ఈసారి ఎలాగైనా పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలవాలన్న పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తుంది. పలువురు నేతలు ప్రభుత్వ ఉద్యోగాలు, సొంత వ్యాపారాలను వదిలీ రాజకీయాల్లోకి అడుగులు వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాలు ఉన్నాయి. ఎస్టీ రిజర్వుడు స్థానం కావడంతో కొత్త నేతలు పోటీ చేసేందుకు క్యూకడుతున్నారు. తమ సొంత సామాజిక వర్గానికి చెందిన కొంతమంది నేతలను వెంటేసుకుని నిత్యం పార్లమెంట్ పరిధిలో చక్కర్లు కొడుతున్నారు. అప్పుడే ప్రధాన పార్టీల అధిష్ఠానం పెద్దల ఆశీస్సులు ఉన్నాయంటూ ప్రచారం చేసుకుంటున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌ల నుంచి అవకాశం వస్తే పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఆశావహ నేతలు అధిష్ఠానం నిర్ణయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. పార్లమెంట్ పరిధిలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను ఎప్పటికప్పుడు పసిగడుతూ అప్రమత్తమవుతున్నారు.

ఆదివాసీ, లంబాడాల మధ్యనే పోటీ

ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం ఎస్టీ రిజర్వుడు కావడంతో ఆదివాసీ, లంబాడా నేతల మధ్యనే ప్రధానంగా పోటీ కనిపిస్తోంది. సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు ఆదివాసీ సామాజికవర్గం కావడంతో.. అదే సామాజిక వర్గానికి చెందిన నేతలను ఈసారి ఎన్నికల బరిలో దింపేందుకు ప్రధాన పార్టీలన్నీ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇప్పటి వరకు ఏ పార్టీ అభ్యర్థులను ప్రకటించక పోయినా అంతర్గతంగా ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తుంది. ఓ అడుగు ముందుకేసిన బీజేపీ ఈనెల 16 లేదా 18న అభ్యర్థుల తొలి జాబితాను వెల్లడిస్తామని ప్రకటించింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కూడా అభ్యర్థి ఎంపికపై సీరియస్‌గా దృష్టి సారిస్తు న్నాయి. ఇప్పటికే ఆశావహ నేతల నుంచి దరఖాస్తులను స్వీకరించిన ప్రధాన పార్టీలు గెలుపు అవకాశాలను అంచనా వేస్తున్నాయి. ఆదివాసీ తొమ్మిది తెగలతో పాటు లంబాడా సామాజికవర్గానికి చెందిన నేతలు ఎంపీ ఎన్నికల బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆదివాసీ సామాజికవర్గం నుంచి ఎంపీ సోయం బాపురావుతో పాటు మాజీ ఎంపీ గోడం నగేష్, ఆత్రం సక్కు, ఆత్రం సుగుణ, డా.సుమలత, డా.మనోహర్, శ్రీలేఖ, పలువురి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అలాగే లంబాడా సామాజికవర్గం నుంచి మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, మాజీ ఎమ్మెల్యే రేఖాశ్యాం నాయక్, జాన్సన్‌నాయక్, రాజేష్‌బాబు, శ్రీనివాస్‌నాయక్, అభినవ్ సర్దార్, తదితరులు ఎంపీ టికెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక వేళ ప్రధాన పార్టీల నుంచి అవకాశం దక్కకపోతే స్వతంత్ర అభ్యర్థులుగా ఎన్నికల బరిలో నిలిచేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మొత్తానికి ఆదివాసీ, లంబాడా నేతల మధ్య పోటాపోటీ కనిపిస్తున్నా.. ప్రధాన పార్టీలన్నీ ఆదివాసీ నేతలవైపే ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు.

ప్రజల్లో ఉండేలా ప్లాన్

పార్లమెంట్ పరిధిలో విస్తృతంగా పర్యటిస్తున్న ఆశావహ నేతలు నిత్యం ప్రజల్లో ఉండేలా ప్లాన్ చేసుకుంటున్నారు. మర్యాదపూర్వకంగా పార్టీ నేతలు, ముఖ్య కార్యకర్తలను కలుస్తూ మద్దతునివ్వాలని కోరుతున్నారు. పార్టీ కార్యక్రమాలు, రాష్ట్రస్థాయి నేతల పర్యటనల్లో పాల్గొంటూ హల్‌చల్ చేస్తున్నారు. టికెట్ తమకే వస్తుందని ధీమాతో చెబుతున్నారు. ఇప్పటికే కొంతమంది నేతలు అధిష్ఠానం ఇచ్చినా.. అంతర్గత ఆదేశాలతో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ పట్టు పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాకుండా కొందరైతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ మద్దతును కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. అభ్యర్థులను ప్రకటించక ముందే కొంతమంది నేతలు తామే పార్టీ అభ్యర్థులమంటూ ప్రచారం చేసుకుంటున్నారు. అలాగే సేవా కార్యక్రమాలతో దూసుకుపోతున్నారు. నిత్యం శుభకార్యాలు, పండుగలు, పరామర్శ లు పేరిట పర్యటనలు చేస్తున్నారు. సిట్టింగ్ ఎంపీకి దీటుగా కార్యక్రమాలను ఏర్పాటు చేసుకుంటూ బల ప్రదర్శనకు దిగుతున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలలో పోటాపోటీ ఉండగా.. ఇప్పటి వరకు ఏ పార్టీతో సంబంధం లేని నేతలు కూడా తగ్గేది లేదంటూ ప్రజల్లోకి దూసుకెళుతున్నారు. అయితే కొందరు ఆశావహ నేతలు తమ పలుకుబడిని పెంచుకునే విధంగా ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకుంటూ సోషల్ మీడియా వేదికగా జోరుగా ప్రచారం చేసుకుంటున్నారు.

అభ్యర్థుల ఎంపిక కోసం సర్వేలు

జిల్లా పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసేందుకు పలువురు నేతలు పోటీ పడడంతో అధిష్ఠానం పెద్దలు రహస్యంగా సర్వేలను నిర్వహిస్తూ అభ్యర్థుల ఎంపికను చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏ సామాజిక వర్గానికి చెందిన నేతలకు అవకాశం ఇస్తే గెలుపు అవకాశాలు మెరుగుపడుతాయో? తెలుసుకునే పనిలో నిమగ్నమయ్యారు. గత పక్షం రోజులుగా ప్రధాన పార్టీలన్నీ దీటైనా అభ్యర్థుల కోసం వేట మొదలు పెట్టినట్లు తెలుస్తుంది. ఇప్పటికే బీజేపీ పార్టీలోని పలువురు ముఖ్య నేతలకు నేరుగా ఫోన్లు చేస్తూ ఎంపీ అభ్యర్థి ఎంపికపై అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు తెలుస్తుంది. సిట్టింగ్ ఎంపీతో పాటు మరో ముగ్గురు, నలుగురు నేతల పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీలోనూ పోటీ ఎక్కువగానే కనిపిస్తోంది. దీంతో గాడ్‌ఫాదర్ల ద్వారా ఆశావహ నేతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. బీఆర్ఎస్‌లో మాత్రం గోడం నగేష్, ఆత్రం సక్కు, జాన్సన్‌నాయక్ ముగ్గురు పేర్లు మాత్రమే ప్రధానంగా వినిపిస్తున్నాయి. ప్రధాన పార్టీలలో ఏ పార్టీ అయినా ముందుగా అభ్యర్థులను ప్రకటిస్తే మిగితా పార్టీలలో సమీకరణలకు అవకాశం లేకపోలేదు.



పిల్లల ఎత్తు, బరువు చూస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

విద్యార్థులకు పోషకాహారం అందేలా చర్యలు : సూపర్‌వైజర్

నేరడిగొండ, ఫిబ్రవరి 13: విద్యార్థులకు పోషకాహారం అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అలాన్నారు. నేరడిగొండ మండలంలోని లఖంపూర్(జి) గ్రామంలో 0నుంచి 5 సంవత్సరాల పిల్లల బరువు, ఎత్తు, జబ్బ చుట్టు కొలతలు తీసి.. తల్లులకు పిల్లల స్థితిగతుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు సరైన రీతిలో పెరిగినప్పుడు వాళ్ల శారీరకంగా మానసికంగా సరైన రీతిలో పెరగడానికి పునాది అంగన్‌వాడీ కేంద్రంలో మొదలవుతుందన్నారు. అంతేకాకుండా ప్రీస్కూల్ కార్యక్రమాల ద్వారా పిల్లల్లో మేధోవికాసం బలపడుతుందని, అంగన్‌వాడీ సేవలు గ్రామస్థులు వినియోగించుకోవాలని కోరారు. ఇందులో పంచాయతీ కార్యదర్శి, ప్రైమరీ స్కూల్ టీచర్, అంగన్‌వాడీ టీచర్, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్-2024 ఫలితాల్లో ఎస్ఆర్ ప్రభంజనం



టి.తేజస్వీ



డి.మనీష్

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 13: అత్యంత ప్రతిష్ఠాత్మకమైన జేఈఈ మెయిన్స్ 2024 (సీజన్-1) ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు ఎస్ఆర్ విద్యా సంస్థల ఛైర్మన్ ఎ.వరదారెడ్డి తెలిపారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో జాతీయ స్థాయిలో దొంతుల మనీష్ 99.99 శాతం పర్సంటైల్ సాధించి ఎస్ఆర్ విద్యాసంస్థల కీర్తి ప్రతిష్ఠలను జాతీయస్థాయిలో నిలబెట్టినట్లు తెలిపారు. అలాగే తుమ్మ తేజస్వీ 99.95 శాతం, ఆర్.దీపాన్ష్ రెడ్డి 99.19 శాతం, పి.నిహాల్ శ్రీవాత్సవ్ 99.91 శాతం సాధించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో అత్యుత్తమైన ర్యాంకులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను వరదారెడ్డి అభినందించారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన విద్యార్థి



మాదస్తు బిట్టు

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి13: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జిల్లా విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్‌కు చెందిన రాజేశ్వర్-సునిత దంపతుల కుమా రుడు మాదస్తు బిట్టు సత్తాచాటాడు. జనవరి 30న నిర్వ హించిన జేఈఈ మెయిన్స్ పరీక్షలో ఆలిండియా వ్యాప్తం గా 96 శాతం మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబ ర్చాడు. ఈ ఘనత సాధించిన విద్యార్థిని కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.



ఇచ్చోడలో ఎంపీడీవోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు

నూతన ఎంపీడీవోల బాధ్యతల స్వీకరణ

ఇచ్చోడ, ఫిబ్రవరి 13: ఇచ్చోడ నూతన ఎంపీడీవోగా లక్ష్మణ్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఇంతకుముందు నిజామాబాద్ జిల్లాలో విధులు నిర్వహించిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చానని, నూతన ఎంపీడీవోగా బాధ్యతలను తీసుకుట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా వచ్చిన ఎంపీడీవోను మండల నాయకులు ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి ఎంపీడీవోగా కె.భాస్కర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోకి కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

బోథ్: బోథ్ ఎంపీడీవోగా ఎల్.రమేష్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన సుశీల్‌రెడ్డిని నిర్మల్ జిల్లాకు బదిలీ చేయగా నిర్మల్ జిల్లా మామడ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన రమేష్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు.

నేరడిగొండ: నేరడిగొండ ఎంపీడీవోగా మంగళవారం రాజవీర్ బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇన్‌చార్జీ ఎంపీడీవోగా ఎంపీవో లక్ష్మణ్ బాధ్యతలు నిర్వహించారు. నేరడిగొండ ఎంపీడీవో రాజ్‌వీర్ బాధ్యతలు స్వీకరించగా.. వారికి గిరిజన లంబాడీల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్‌తో పాటు నాయకులు శాల్వతో సన్మానించారు.



నేరడిగొండ ఎస్సైగా శ్రీకాంత్

నేరడిగొండ, ఫిబ్రవరి 13: నేరడిగొండ నూతన ఎస్సైగా శ్రీకాంత్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్సై సాయన్న ఆదిలాబాద్ టూటౌన్ పోలీసు స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. సిరికొండ పోలీసు స్టేషన్ నుంచి శ్రీకాంత్ నేరడిగొండ పోలీసు స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం తనవంతు కృషి చేస్తానని అన్నారు. మండల ప్రజలు, నాయకులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు. కాగా పోలీసు సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గం రద్దు

బోథ్, ఫిబ్రవరి 13: బోథ్ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. మార్కెట్ కమిటీ ఛైర్మన్‌తో పాటు పాలకవర్గాన్ని సైతం రద్దు చే స్తున్నట్లు జీవోలో వెల్లడించారు. దీంతో ఇప్పటి వరకు మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన రుక్మాన్‌సింగ్ మిగతా పాలకవర్గ సభ్యులు తమ సభ్యత్వాన్ని పదువులను కోల్పోయారు.

పకడ్బందీగా పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్
- స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన
- ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమావేశం



కౌంటింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్



అధికారుల వద్ద వివరాలు అడిగి తెలుసుకుంటూ..

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 13: రానున్న పార్లమెంట్ఎన్నికలనిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక టీటీడీసీ హాల్‌లో సిర్పూర్, ఆసిఫాబాద్, ఖానాపూర్, ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముథోల్ నియోజకవర్గాలకు చెందిన అధికారులతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన అధికారులు స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్, కేంద్రాల ఏర్పాట్లను చేపట్టాలన్నారు. ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించేందుకు పీవో, ఏపీవో, సెక్టోరల్ అధికారులకు శిక్షణలను అందించాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఉంటాయని, రిసిప్షన్ కేంద్రాలు ఆదిలాబాద్‌లోని సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సంఘం సూచించిన నియమాలు తూ.చా. తప్పకుండా పాటించాలని సూచించారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూమ్ కౌంటింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు ఖుష్బుగుప్తా, దీపక్‌తివారి, ఆయా నియోజక వర్గాల అధికారులు, ఎన్నికల విభాగం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



నాగోబాను దర్శించుకున్న విజయ మాజీ డెయిరీ ఛైర్మన్, భక్తులు



బేతాల్ పూజ, మండగాజలింగ్ పూజలకు హాజరైన మెస్రం వంశీయులు, మహిళలు



కానుకలను అందజేస్తున్న మెస్రం వంశీయులు

జనసంద్రమైన నాగోబా సన్నిధి

- సుదూర ప్రాంతాల నుంచి కేస్లాపూర్‌కు తరలివస్తున్న భక్తజనం
- బేతాల్, మండగాజలింగ్ పూజలతో ముగింపు దశకు..
- మెస్రం వంశీయులు, మహిళల సంప్రదాయ పూజలు
- ఎడ్లబండ్లపై శ్యాంపూర్‌కు తరలిన మెస్రంలు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 13: ఆదివాసీల ఆరాధ్య దైవం మండలంలోని కేస్లాపూర్ నాగోబా సన్నిధి మంగళవారం భక్త జనసంద్రమయ్యింది. తెలంగాణాలో ఆదివాసీల రెండో అతిపెద్ద గిరిజన జాతర కావడంతో ఐదో రోజు కూడా సుదూర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈనెల 9న అర్ధరాత్రి మెస్రం వంశీయుల సంప్రదాయ పూజల మధ్య అట్టహాసంగా ప్రారంభమైన నాగోబా జాతర మంగళవారం ఉదయం బేతాల్ పేరిట నిర్వహించే కర్ర సాముతో ముగింపు దశకు చేరుకుంది. దర్శనం కోసం శుక్రవారం విజయ డెయిరీ మాజీ ఛైర్మన్ లోక భూమారెడ్డి, గోవర్ధన్‌రెడ్డిలు నాగోబా దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. మండల సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో ఫిల్టర్ వాటర్‌ను ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో బేతాల్, మండగాజలింగ్ పూజలు

జాతరలో భాగంగా మంగళవారం ఉదయం మెస్రం వంశీయులు ప్రత్యేకంగా సమావేశమై భక్తిశ్రద్ధలతో బేతాల్, మండగాజిలి పూజలు నిర్వహించారు. అనంతరం మట్టి కుండలను మెస్రం వంశీయుల్లోని 22 కితల తెగల వారికి పంపిణీ చేశారు. ముందుగా నాగోబాతో పాటు సతీ దేవతలను దర్శించుకున్న భక్తులు సమర్పించిన కానుకలను పూజారి కటోడ మెస్రం కోసు, మెస్రం కోసేరావు, మెస్రం హనుమంత్‌రావు ప్రసాదంగా అందజేశారు. మెస్రం పూజారులు, వంశీయులు తమ ఆచారం ప్రకారం మండగాజిలి, బేతాల్ పూజలు చేశారు. ఆలయ సమీపంలో సమావేశమైన అనంతరం పూజారులు పంచభూతాలకు తంబాకు వదిలి నేలతల్లికి మొక్కారు. మెస్రం వంశీయులు పీఠాధిపతి మెస్రం వెంకట్రావు పటేల్ కాగాడాలను వెలిగించి బేతాల్ పూజలను ప్రారంభించారు. అనంతరం ఆదివాసీ సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తూ నృత్యాలు చేస్తూ గోవాడ్‌కు చేరుకున్నారు. గోవాడ్ ఎదుట మెస్రం వంశీయుల మహిళల ఆధ్వర్యంలో మెస్రం వెంకట్‌రావు పటేల్ చేతి కర్రతో పాటు పెద్దల పాదాలను నీటితో కడిగారు. మహిళలు, మెస్రం వంశీయులు వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం వారి వాయిద్యాలు వాయిస్తూ మహిళలు, పురుషులు వేర్వేరుగా బేతాల్ నృత్యాలు చేశారు. తరువాత అక్కడి నుంచి నాగోబాను దర్శించుకున్నారు. అనంతరం నాగోబా పూజలతో పాటు సంప్రదాయ పూజలకు ముగింపు పలికారు. సాయంత్రం కేస్లాపూర్ నుంచి కుటుంబ సమేతంగా ఎడ్లబండ్లలో ఉట్నూర్ మండలంలోని శ్యామ్‌పూర్‌లోని భుడందేవు జాతర కోసం బయల్దేరనున్నట్లు మెస్రం వంశీయులు పెద్దలు తెలిపారు.

రేపు భుడుందేవ్‌కు పూజలు

ఉట్నూర్: ఉమ్మడి జిల్లాలోని మెస్రం గిరిజనులు కొలిచే ఆరాధ్య దైవం నాగోబా కాగా ఉట్నూర్ మండలంలోని షాంపూర్‌లో వెలిసిన భుడుందేవ్‌ను సైతం మేస్రం గిరిజనులు తమ దైవంగా భావిస్తారు. పుష్యమి అమావాస్య రోజున ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో వెలిసిన నాగోబా దేవతకు గత 9న అర్ధరాత్రి పవిత్ర గంగాజలంతో మహాపూజ చేసిన మెస్రం వంశీయులు నాగోబా జాతరను ప్రారంభించారు. ప్రతీరోజు నాగోబా దేవత వద్ద సంప్రదాయ పూజలు నిర్వహించిన మెస్రం గిరిజనులు మంగళవారం భేతాల్ పూజలు నిర్వహించారు. భేతాల్‌పూజలు చేసిన అనంతరం జాతర ఆఖరి రోజుగా మెస్రం గిరిజనులు భావిస్తారు.



ఏదైనా ఊరి పొలిమేరలో ఒక్కరోజు విడిది

నాగోబా చెంత భేతాల్ పూజలు చేసిన రోజే అక్కడి నుంచి తమతో తెచ్చుకున్న ఎడ్లబండ్లతో మెస్రం గిరిజనులు పయనమై మార్గమధ్యంలో ఏదైనా ఊరి పొలిమెరలో ఒకరోజు విడిది చేస్తారు. ఆ మరుసటి రోజు బుధవారం భుడుందేవ్ జాతర ప్రాంతానికి చేరుకోగానే ముందుగా భూతల్లికి పూజలు చేసి ఆలయం వద్దకు చేరుకుని గురువారం ఉట్నూర్ మండలంలోని షాంపూర్‌లో కొలువైన భుడుందేవ్‌కు పవిత్ర గోదావరి జిల్లాలతో సంప్రదాయ పద్దతుల్లో పూజలు నిర్వహించి షాంపూర్ జాతరను ప్రారంభిస్తారు. మెస్రం గిరిజనుల పూజలతో షాంపూర్ జాతర గురువారం నుంచి 15 రోజుల పాటు కొనసాగుతుంది. కేస్లాపూర్ జాతరలో వెలిసిన జాతరలో వెలసిన దుకాణాల వ్యాపారులు సోమవారం వరకు అక్కడే ఉండి మంగళవారం నుంచి సాంపూర్ జాతరకు చేరుకుంటారు. గురువారం పూజలు చేసి జాతర ప్రారంభించిన అనంతరం మఎ్రం గిరిజనులు తమ తమ ఇళ్లకు చేరుకుంటారు. షాంపూర్‌జాతరకు ఉమ్మడి జిల్లాలోని ప్రజలతో పాటు కరీంనగర్, నిజామాబాద్ నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ కాగజ్‌నగర్, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలివచ్చి నంది రూపంలో ఉన్న భుడుందేవ్‌కు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.



నాగోబా దర్శనానికి తరలివస్తున్న భక్తులు



శ్యామ్‌పూర్‌లో అందంగా ముస్తాబైన భుడుందేవ్ ఆలయం
(ఇన్‌సెట్‌లో మెస్రం గిరిజనుల దైవం భుడుందేవ్)